సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ǀ 3 ǀ మే ǀ 2024



..గ్యారంటీలు అమలు చేశాం

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేసిందని ఎమ్మెల్యే పాయం తెలిపారు. IIలో



ఎండలతో జర పైలం..

జిల్లాలో వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా వృద్ధులు, పిల్లలు అల్లాడిపోతున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం

43° / 28°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కమనీయం.. కల్యాణం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలుదీతీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కనకదుర్గమ్మకు పుష్పార్చన

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం ఘనంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 పుష్పాలతో అర్చన గావించారు. హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

ముగిసిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: గత నెల 25 నుంచి ప్రారంభమైన ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లాలో పదో తరగతి అభ్యర్థులకు మూడు సెంటర్లు, ఇంటర్ అభ్యర్థులకు నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఓపెన్ ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

12న ఆత్మారాముడి కల్యాణం

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలో కొలువై ఉన్న ఆత్మారామచంద్రస్వామి కల్యాణం ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కమిటీ బాధ్యులు గురువారం కరపత్రాలు విడుదల చేశారు. పవిత్ర గోదావరి నదీ తీరాన వేంచేసిఉన్న స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గోర్స అశోక్, గ్రామస్తులు దల్లి అప్పలరెడ్డి, కెల్లా శేఖర్, చిట్టిబాబు, ఆలయ అర్చకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను గతంలో విడుదల చేయగా.. ఇందులో మార్పులు చేశారు. ఈ మేరకు కొత్త టైంటేబుల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి గురువారం విడుదల చేశారు.రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 6, 8, 10, 16, 18, 21, 25, 29వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 7, 9, 15, 17, 20, 22, 28, 30వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటవరకు జరగనున్నాయి. అలాగే, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

పారదర్శకంగా హోం ఓటింగ్ ప్రక్రియ




మాట్లాడుతున్న ప్రతీక్ జైన్

మణుగూరు రూరల్: హోమ్ ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో హోమ్ ఓటింగ్‌పై పీఓ, ఏపీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 85 సంవత్సరాలపై బడిన వృద్ధులు, దివ్యాంగులతో ఓటింగ్ పూర్తి చేయించాలని, మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. అధికారులు రాఘవరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దక్కని ప్రాతినిధ్యం

జిల్లా నుంచి ఒక్కరూ పార్లమెంట్‌లో అడుగుపెట్టని వైనం

- ఖమ్మం స్థానానికి 17 సార్లు ఎన్నికలు జరిగినా రాని అవకాశం
- భద్రాచలం, మహబూబాబాద్‌లోనూ మొండిచేయే



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : దేశానికి స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటాయి. పార్లమెంటుకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం 18వ పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగుతున్నాయి. కానీ ఇప్పటివరకు ఏజెన్సీ ప్రాంతం విస్తరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేతలకు దిగువసభలో అడుగు పెట్టే అవకాశం రాలేదు.

ఖమ్మం నుంచి..

జిల్లా పరిధిలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ స్థానాలు మహబూబాబాద్ (ఎస్టీ) పార్లమెంటు పరిధిలో, కొత్తగూడెం, అశ్వారావుపేట ఖమ్మం (జనరల్) పార్లమెంటు పరిధిలో ఉన్నాయి. ఖమ్మం పార్లమెంటు స్థానానికి 17సార్లు ఎన్నికలు జరగ్గా తొమ్మిది మంది ఎంపీలుగా పార్లమెంటుకు వెళ్లారు. 1952, 1957లలో జరిగిన తొలి, మలి ఎన్నికల్లో టీబీ విఠల్‌రావు కమ్యూనిస్టు పార్టీల తరఫున గెలిచారు. ఆయన స్వస్థలం ప్రస్తుతం మహారాష్ట్ర పరిధిలో ఉండగా, గతంలో అవిభాజ్య హైదరాబాద్ రాష్ట్రంలో ఉండేది. ఆ తర్వాత వరుసగా జలగం కొండలరావు, జలగం వెంగళరావు, పీవీ రంగయ్య నాయుడు, తమ్మినేని వీరభద్రం, నాదెండ్ల భాస్కరరావు, రేణుకా చౌదరి, నామా నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఎంపీలుగా గెలుపొందారు. వీరిలో పీవీ రంగయ్యానాయుడు, రేణుకా చౌదరి, నాదెండ్ల భాస్కరరావుల జన్మస్థలాలు ఏపీలో ఉండగా మిగిలినవారు ప్రస్తుత ఖమ్మం జిల్లాకు చెందిన వారుగా ఉన్నారు. మొత్తం తొమ్మిది మందిలో ఒక్కరూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూలాలు ఉన్న వారు లేరు.

మహబూబాబాద్‌లో కూడా నో చాన్స్..

భద్రాచలం పార్లమెంటు నియోజకవర్గం 2008లో రద్దుకాగా ఆ స్థానంలో మహబూబాబాద్ కొత్తగా ఏర్పడింది. ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నికలు జరగగా, తొలి, మలి ఎన్నికల్లో ములుగు జిల్లాకు చెందిన పోరిక బలరాంనాయక్, అజ్మీర సీతారాం నాయక్ గెలిచారు. మూడో ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లా మూలాలు ఉన్న మాలోత్ కవిత విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఈ ముగ్గురే మూడు ప్రధాన పార్టీల తరఫున పోటీ పడుతున్నారు. దీంతో మరోసారి ఈ స్థానం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నేతలకు నిరాశే ఎదురైంది.

ఒక్కసారి కూడా..

ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ స్థానాల నుంచి భద్రాద్రి జిల్లాకు చెందిన వారికి ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసే అవకాశం దక్కలేదు. గతంలో ప్రజారాజ్యం, వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులను విజయం వరించలేదు. అయితే, ఈసారి మాత్రం ఖమ్మం నుంచి పోటీలో ఇద్దరు భద్రాద్రి జిల్లా వాసులు ఉన్నారు. జిల్లాలోని ములకలపల్లి మండలానికి చెందిన బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, కొత్తగూడేనికి చెందిన బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్ పోటీలో ఉన్నారు.

భద్రాచలంలోనూ..

భద్రాచలం పార్లమెంటు స్థానాన్ని ఎస్టీలకు రిజర్వ్ చేస్తూ తొలిసారిగా 1967లో ఎన్నికలు నిర్వహించారు. చివరిసారిగా ఈ స్థానానికి 2004లో ఎన్నికలు జరిగాయి. భద్రాచలం పార్లమెంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, బూర్గంపాడులతో పాటు విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉండేది. దీంతో ఇక్కడి నుంచి ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసే అవకాశం ఎక్కువగా ఆంధ్రా నేతలకే దక్కింది. కొద్దిమంది ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకు పోటీ చేసి చట్టసభలో అడుగు పెట్టే అవకాశం వచ్చినా, ప్రస్తుతం ఆ ప్రాంతాలు రాష్ట్ర విభజన తర్వాత ఏపీ పరిధిలోకి వెళ్లాయి. ఈ స్థానానికి 11 సార్లు ఎన్నికలు జరగగా ఐదుగురు పార్లమెంటుకు వెళ్లారు. వీరిలో అత్యధికంగా నాలుగు సార్లు ఎన్నికైన రాధాబాయి ఆనందరావు స్వస్థలం ఖమ్మం కాగా విద్యాభ్యాసం రాజమండ్రిలో జరిగింది. మిగిలిన వారిలో సోడే రామయ్య కొండ్రాజుపేట(వీఆర్ పురం), కర్రెద్దుల కమలకుమారి లక్కవరం (చింతూరు మండలం), దుంపా మేరి విజయకుమారి విశాఖపట్నం, మిడియం బాబూరావు రాజమండ్రి ప్రాంతాలకు చెందినవారు.

ఆ ఐదింటి సంగతేంటి?

- లోక్‌సభ ఎన్నికల వేళ మళ్లీ తెరపైకి విలీన పంచాయతీలు
- అదే హామీ ఇస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు
- పదేళ్లుగా పట్టించుకోలేదని భద్రాచలంవాసుల ఆవేదన



ఐదు గ్రామపంచాయతీలను కలపాలని ఆందోళన చేపట్టిన భద్రాచలంవాసులు (ఫైల్)

భద్రాచలం: లోక్‌సభ ఎన్నికల వేళ విలీన ఐదు పంచాయతీల విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆ ఊళ్లను తిరిగి తెలంగాణలో కలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ప్రధాన పార్టీల అభ్యర్థులు తాజా ప్రచారంలో పేర్కొంటుండగా, గత ఎన్నికల్లో కూడా ఇదే హామీఇచ్చారని, ప్రతీసారి ఎన్నికల ప్రచార అస్త్రంగా మాత్రమే వాడుకుంటున్నారనే తప్ప అభివృద్ధి కుంటుపడుతున్నా పట్టించుకోవడంలేదనే భావన భద్రాచలం ప్రాంతవాసుల్లో వ్యక్తమవుతోంది.

పలుమార్లు ఆందోళన చేపట్టినా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో తొలుత భద్రాచలం డివిజన్‌లోని కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, కుక్కునూరు వేలేరుపాడు మండలాలను పూర్తిగా, భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో కొన్ని గ్రామాలను ఏపీలో కలుపుతున్నట్లు గెజిట్ విడుదల చేశారు. అనంతరం స్వల్ప కాలంలోనే భద్రాచలం మండలంలోని పిచుకులపాడు, కన్నాయిగూడెం, గుండాల, పురుషోత్తపట్నం, యటపాక గ్రామ పంచాయతీలను సైతం ఏపీలో విలీనం చేస్తున్నట్లు మరో గెజిట్ విడుదల చేశారు. దీంతో భద్రాచలం పట్టణం మినహా ఇతర ప్రాంతాలన్నీ ఏపీలో కలిసిపోయాయి. ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని అక్కడి ప్రజలతోపాటు భద్రాచలం ప్రజలు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఐదు గ్రామపంచాయతీల ప్రజలు తీర్మానాలు కూడా చేశారు. పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. భద్రాచలం పర్యటనకు వచ్చిన నాటి గవర్నర్ తమిళిసైను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదు.

ప్రతీసారి ఎన్నికల హామీగా..

విలీన ఐదు గ్రామపంచాయతీల ప్రజల ఓటర్లు ఏపీలోని పాడేరు నియోజకవర్గ పరిధిలోకి వస్తారు. భద్రాచలాన్ని ఆనుకుని అధిక భూభాగం ఉండటంతో పాటు, రామాలయ భూములు ఆ గ్రామపంచాయతీల పరిధిలోనే ఉన్నాయి. భద్రాచలం అభివృద్ధి వాటిపైనే ఆధారపడి ఉంది. విలీన వ్యవహారం ఇరు రాష్ట్రాలతోపాటు కేంద్రం కూడా చొరవ చూపాల్సి రావడం, భద్రాచలంలోని అత్యధిక ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు ఇదే కీలక హామీగా మారుతోంది. 2014, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పంచాయతీల విలీనానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తాజాగా 2024 ఎన్నికల ప్రచారంలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అదే హామీ ఇస్తున్నాయి. గడిచిన పదేళ్లలో అధికార, ప్రతిపక్షాలు తమ సమస్యను పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు పంచాయతీలు తిరిగి తెలంగాణలో ఎందుకు కలపాలంటే..

- పేరుకు ఆంధ్రప్రదేశ్‌లో కలిపినా కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాకలు భౌగోళికంగా ఇప్పటికీ భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్నాయి.
- భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న పురుషోత్తపట్నం, ఎటపాక, గుండాలలో ఖాళీ భూములు అనేకం ఉన్నాయి. భద్రాచలం విస్తరణకు ఈ భూములు తప్పనిసరి.
- భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన భూములు సుమారు 900 ఎకరాలు పురుషోత్తపట్నంలోనే ఉన్నాయి. దీనివల్ల ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగటం లేదు.
- తెలంగాణలోని భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వెళ్లి రావాలంటే ఏపీకి చెందిన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం మీదుగా వెళ్లి రావాలి.
- గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలు సకాలంలో చేపట్టలేకపోతున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెంరూరల్: ఎంపీగా నామ నాగేశ్వరరావును గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేస్తానంటూ ఖమ్మంలో జరిగిన బస్సు యాత్రలో మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారని, దీనిని బట్టి బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని అర్థమవుతోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం చుంచుపల్లి మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పలువురు నాయకులు ఊకంటి గోపాల్‌రావు, గడిపల్లి కవిత, వీరబాబు తదితరులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరినవారికి అండగా ఉంటానని తెలిపారు. కేసీఆర్ పదేళ్లలో అక్రమంగా సంపాదించిన సొమ్ముతో పక్క రాష్ట్రంలో పార్టీ పెట్టారని ఆరోపించారు. ఇక బీజేపీ కులమతాల మధ్య చిచ్చు పెడుతోందని, రామాలయాన్ని రాజకీయంలోకి తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని పేర్కొన్నారు. ఖమ్మం అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఈ నెల 4న సీఎం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు, 7న సినీ హీరో వెంకటేష్ ప్రచారం చేయనున్నట్లు వివరించారు. కాంగ్రెస్‌లో చేరిన ఊకంటి గోపాల్‌రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో వేరే అభ్యర్థికి మద్దతు తెలిపి తప్పు చేశానని, ఇక నుంచి జీవితాంతం శ్రీనన్నతోనే ఉంటానని అన్నారు. అనంతరం ప్రకాశం స్టేడియంలో నిర్వహించే సీఎం సభ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, తూము చౌదరి, తూళ్లురు బ్రహ్మయ్య, ఎడవల్లి కృష్ణ, నాగేంద్ర త్రివేది, నాగ సీతారాములు, రాయల శాంతయ్య, గడిపల్లి కవిత, బిందు చౌహాన్, జేవీఎస్ చౌదరి, మండె వీరహను మంతరావు, పిడమర్తి రవి, వీరబాబు, పిచ్చిరెడ్డి, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

71 శాతం పోల్ స్లిప్పుల పంపిణీ

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో 71 శాతం పోలింగ్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని, మిగిలిన ఓటర్లకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ గురువారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన ప్రియాంక మాట్లాడుతూ జిల్లాకు నూతనంగా కేటాయించిన 1,700 బ్యాలెట్ యూనిట్లను రెండు రోజుల్లో ర్యాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గాలకు అందిస్తామన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఎన్నికలలో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా చూస్తున్నామని వివరించారు. సి విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబరు ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తున్నామని వివరించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎం యంత్రాల తరలింపు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గోపాల్ మాట్లాడుతూ అన్ని చెక్ పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా నిఘా పెట్టాలన్నారు. ఏఆర్ఓలు ప్రతీక్‌జైన్, వేణుగోపాల్, మధు, దామోదర్ రావు, కాశయ్య, ఎలక్షన్ సూపరింటెండెంట్ ధారాప్రసాద్, డీసీఓ ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు ముగ్గురు

పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లు ప్రారంభం

నల్లగొండ: వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు తొలిరోజైన గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థులు మూడు సెట్ల నామినేషన్లు సమర్పించారని నల్లగొండ కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.1.31 కోట్లు



బ్యాంకు అధికారులకు నగదు అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈమేరకు 35 రోజుల కాలానికి గాను రూ.1,31,84,181 ఆదాయం నమోదైందని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. ఇందులో విదేశీ కరెన్సీతో పాటు 230 గ్రాముల బంగారం, 1.450 కేజీల వెండి ఉందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

'విద్యుత్' పోస్టర్ల ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి సబ్‌డివిజన్ ఓఅండ్ఎం, సర్కిల్ సిబ్బందికి విద్యుత్ ప్రమాదాలు–నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యుత్ ఎస్ఈ కె.రమేష్ మాట్లాడుతూ భద్రతా సూత్రాలను పాటిస్తూ ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి రక్షణ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆఫీసర్ ఇ.మురళి, నందయ్య, బి.వెంకటరత్నం, కె.వేణు, ఎండీ యాసిన్, పి.ప్రభాకర్, ఎ.రఘురామయ్య, పి.బుజ్జికన్నయ్య, హెచ్.దేవా, ఎస్‌కే రజియాబేగం, కె.పావని, కె.హరిత పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్!

- ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన
- డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీ రేణుక, పార్టీ శ్రేణుల కృషితో గెలుస్తా..
- లోక్‌సభ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఫలితాలే రిపీట్
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌వి తొందరపాటు విమర్శలు
- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించి.. కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఆ ఫలితాలే పార్లమెంట్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయి. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేకపోయారు. అయినా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేయడం తొందరపాటు చర్య. నా విజయానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, పార్టీ నేతలు, కేడర్ కృషి చేస్తున్నారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండగా.. అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తా. నేను స్థానికేతరుడినని చెబుతున్న వారు మా స్వస్థలం కూసుమంచి మండలం చేగొమ్మగా గుర్తించాలి..' అని ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రఘురాంరెడ్డి వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

▸▸ ప్రజల నుంచి స్పందన బాగుంది..

గత నెల 25న నామినేషన్ వేసింది మొదలు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ప్రచారం చేస్తున్నాం. కార్యకర్తలతో భేటీ అవుతూ సభల్లో పాల్గొంటున్నాం. ఇప్పటి వరకు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తయింది. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈనెల 4న కొత్తగూడెంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారానికి వస్తున్నారు. దీంతో మాకు మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది.

▸▸ కాంగ్రెస్‌కే పట్టం ఖాయం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కు తమ సత్తా చూపించారు. గత పదేళ్లలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉద్యోగ నియామకాలు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ, పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇక రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఏమైందో అందరం చూస్తున్నాం. ఉద్యోగ నియామక పరీక్షల పేపర్ లీకేజీలతో నిరుద్యోగులు ఇబ్బంది పడ్డారు. ఇక ఎమ్మెల్యేలు ప్రజలను అనేక విధాలుగా అవస్థ పెట్టారు. వీటితో విసిగిపోయిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు చెప్పారు. అదేమాదిరి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఫలితాలు వస్తాయి. దేశవ్యాప్తంగా శక్తివంతంగా తయారైన ఇండియా కూటమి.. సీపీఎం, సీపీఐ, ఇతర పార్టీలతో కలిసి ఎన్నికల్లో సత్తా చాటుతుంది.

▸▸ 150 రోజులకే ఉలుకెందుకు..

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆయన పదేళ్లు పాలించి సమస్యలు పరిష్కరించలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం 150 రోజుల్లోనే ఆయనకు అంత ఉలుకెందుకు? కరెంట్ కోతలున్నాయని ఆరోపిస్తున్నారు. జిల్లా, రాష్ట్రంలో ఎక్కడా కరెంట్ ఇబ్బందులు లేవు. కావాలనే కేసీఆర్, ఆ పార్టీ శ్రేణులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే 65 లక్షల మంది రైతులకు రైతుబంధు ముట్టింది. మిగిలిన హామీలను కూడా మా ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది.

▸▸ అందరూ కలిసి వస్తున్నారు..

ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో అన్నిచోట్ల పర్యటించేలా షెడ్యూల్ తయారు చేసుకున్నాం. జిల్లాలో ముగ్గురు శక్తివంతమైన మంత్రులు ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎంపీ రేణుకాచౌదరి వస్తున్నారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ప్రచారంలో కలిసొస్తున్నారు. ఏళ్ల తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాముఖ్యత లభించింది. గతంలో జలగం వెంగళరావు ఉన్నప్పుడు ఇలా ఉండేది. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు.

▸▸ సమస్యల పరిష్కారంపై దృష్టి

నేను గెలవగానే లోక్‌సభ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తా. ఖమ్మంలో యూనివర్సిటీ మాత్రమే కాదు.. కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రీయ విద్యాలయం కూడా లేదు. స్పాంజ్ ఐరన్ ఇండస్ట్రీ మూతపడింది. ఇక భద్రాచలం రోడ్–కొవ్వూరు రైల్వేలైన్ డిమాండ్ నెరవేరడం లేదు. కొత్తగూడెంలో విమానాశ్రయం.. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తా.

కాంగ్రెస్‌లో మూడు తరాలు

నేను స్థానికుడిని కాదని కొందరు విమర్శిస్తున్నారు. మాది కూసుమంచి మండలంలోని చేగొమ్మ. ఇక్కడ వ్యాపారాలు కూడా ఉన్నాయి. మా నాన్న నాలుగు సార్లు లోక్‌సభకు, నాలుగు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. మా తాత ఉమ్మడి జిల్లాలో పార్టీ కోసం పనిచేశారు. అలా మూడు తరాలుగా మా కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో పాటు ఉమ్మడి జిల్లాతో సంబంధం ఉంది. నేను గతంలో రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే టికెట్లు ఆశించినా కొన్ని కారణాలతో పోటీ చేయలేకపోయాను. ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా మంచి మెజార్టీతో గెలుస్తా.

క్లుప్తంగా

స్కానింగ్ సెంటర్లలో డీఎంహెచ్ఓ తనిఖీ

కొత్తగూడెంరూరల్: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లలో డీఎంహెచ్ఓ శిరీష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుమతి లేకుండా సంతాన, సాఫల్య కేంద్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి స్పందన, డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్‌మొహిద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హతం

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనే నెపంతో ఇద్దరు గిరిజనులకు మావోయిస్టులు హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్‌స్టేషన్ పరిధి చుత్వాహి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. చుత్వాహి గ్రామానికి బుధవారం అర్ధరాత్రి వచ్చిన సుమారు 20 మంది మావోయిస్టులు నిద్రిస్తున్న మడవి ఉంగా, మడవి జోగాను లేపి శివారుకు తీసుకెళ్లి దారుణంగా నరికి చంపారు. ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందునే వీరిని హతమార్చామని, మరెవరైనా పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుందని అక్కడ వదిలిన లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రెండు నెలల కాలంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో 88 మంది మావోయిస్టులు మృతి చెందగా.. ఇందుకు ఇన్‌ఫార్మర్లే కారణమంటూ మావోయిస్టులు ఈ దురాఘాతానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో బీజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతాల గిరిజనులు భయంతో వణికిపోతున్నారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం కొందరు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. నలుగురు యువకులు కారులోనే మద్యం సేవించి ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం హల్‌చల్ చేశారని, మద్యం మత్తులో కారు నడుపుతుండగా అది అదుపుతప్పి పక్కనే ఉన్న సిమెంట్ దిమ్మెకు బలంగా ఢీకొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నదని స్థానికులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని కారు నడుపుతున్న వ్యక్తికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, కారుతో పాటు యువకులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. మద్యం సేవించి కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

11 సిలిండర్లు పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా ఓ ఇంట్లో నిల్వచేసిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను డీఎస్ఓ రుక్మిణి సివిల్ సప్లయి అధికారులతో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. సారపాకకు చెందిన కొందరు వ్యక్తులు మండలంలోని కోడిపుంజులవాగు గ్రామానికి చెందిన రాములు ఇంట్లో సిలిండర్లను నిల్వ చేసి, అధిక ధరకు విక్రయిస్తున్నారు. సమాచారం మేరకు గురువారం దాడి చేసి ఇంట్లో ఉన్న 11 డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్నట్లు డీఎస్ఓ తెలిపారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వృద్ధుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దొంతికుంటకు చెందిన పుట్టి రాంబాబు, అదే ప్రాంతానికి చెందిన స్రవంతితో ఐదేళ్లుగా సహజీవనం చేస్తూ, మూడు నెలల కిందట వివాహం చేసుకున్నాడు. కాగా బుధవారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో స్రవంతి ఇంటి పక్కనే ఉన్న తన తాతయ్య నాగేంద్రరావు ఇంటికి వెళ్లింది. అయితే రాత్రి 10 గంటల సమయంలో భర్త రాంబాబు, స్రవంతి వద్దకు వెళ్లి ఇంటికి వెళ్దామని చెప్పి తీసుకెళ్తున్న సమయంలో తాతయ్య నాగేంద్రరావు అడ్డుకొని రాంబాబు తలపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. రాంబాబు తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి అన్న పుట్టి రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మే పుష్పవికాసం..



కొత్తగూడెం రుద్రంపూర్‌లోని ఓ ఇంట్లో గురువారం మే పుష్పం వికసించింది. ఏటా మే నెలలో మాత్రమే వికసించే ఈ పుష్పాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– సింగరేణి(కొత్తగూడెం)

ఎండలతో జర పైలం..

- వారం రోజులుగా దంచికొడుతున్న ఎండలు
- జిల్లాలో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెం పోస్టాఫీస్ జంక్షన్

చుంచుపల్లి: భానుడు నిప్పులు కక్కుతున్నాడు. వారం రోజులుగా తన ఉగ్రరూపం చూపుతున్నాడు. ఉదయం నుంచే తన ప్రతాపం మొదలుపెట్టి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. గ్రామాలు, పట్టణాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు వడగాలులతో జనం అల్లాడిపోతున్నారు. ఇక ఇళ్ల నుంచి బయటకు రావాలంటే బెదురుతున్నారు. తీవ్ర ఎండలతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా మండే ఎండలతో మధ్యాహ్నం ప్రధాన రోడ్లన్నీ జన సంచారం లేక బోసిపోతున్నాయి. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందుతో పాటు అనేక ప్రాంతాల్లో పెరిగిన ఉష్ణోగ్రతలతో వడగాలులు వీస్తున్నాయి. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి మరో 3 నుంచి 5 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదవుతున్నాయి. బుధవారం రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాచలం, చుంచుపల్లిలో 46.5 డిగ్రీలు, అశ్వాపురంలో 46.1 డిగ్రీలు, సుజాతనగర్‌లో 46 డిగ్రీల చొప్పున రాష్ట్రంలోనే రికార్డుస్థాయి పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాల్వంచ యానంబైలులో 46.0, మణుగూరులో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రతలతో పాటు అనేక చోట్ల 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటి నమోదయ్యాయి. గురువారం కూడా ఇంచుమించు అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదుకావడం విశేషం. దీంతో ఇళ్లలో ఏసీలు ఫ్యాన్లు, కూలర్ల కెపాసిటీ సరిపోవడం లేదు. ఫ్యాన్లు వేసినా వడగాలులు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి 10 గంటల వరకు వేడి తీవ్రత తగ్గటం లేదు. మరో నాలుగు రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వడగాలులు వీస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటు వైద్యులు సైతం తీవ్ర ఎండల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండలతో పాటు వడగాలులు తీవ్రమైతే వడదెబ్బకు గురికాకుండా రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదంటున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయి. బయటి ఉష్ణోగ్రతలతో పాటు శరీర ఉష్ణోగ్రత కూడా బాగా పెరుగుతుంది. దీంతో శరీరం తనసుతాను చల్లబర్చడం కోసం చెమటను స్రవిస్తుంది. ఈ క్రమంలో ఒంట్లోని నీటితోపాటు శరీరంలో ఉండే లవణాలు కూడా బయటకు వెళ్లి డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఒక్కోసారి రక్తనాళాలు ఉబ్బి రక్తపోటు పడిపోయి.. మెదడుకు రక్తప్రసరణ ఒక్కసారిగా తగ్గి కళ్లు తిరిగిపడిపోతారు. బయటకు వెళ్లే ముందు తప్పకుండా నీళ్లు, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. శీతల పానీయాలు తాగకూడదు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే చక్కెర, ఉప్పు కలిసిన నీరు తాగాలి. డీహైడ్రేషన్‌కు గురైనవారికి వాంతులు, వికారం, జ్వరం, కడుపునొప్పి వస్తాయి. నీళ్ల విరేచనాలవుతాయి. చర్మం పొడిబారినా, చెమట పట్టకపోయినా, మూత్రం రాకపోయినా డీహైడ్రేషన్‌కు గురైనట్లేనని భావించాలి. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

నీళ్లు ఎక్కువగా తాగాలి



వడదెబ్బ చాలా ప్రమాదకరం. అప్రమత్తంగా ఉండకపోతే ప్రాణాలకే ముప్పు. శరీర ఉష్ణోగ్రత గణనీయంగా పెరగడం వల్ల వడదెబ్బ తగులుతుంది. బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా వెంట వాటర్ బాటిల్ ఉండాలి. రోజుకు కనీసం నాలుగైదు లీటర్ల నీరుతాగాలి. వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలి. తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేలా ఆహారం తీసుకోవాలి. పాలకూర, ముల్లంగి, వెల్లుల్లి, నీరుల్లి, బీట్‌రూట్ తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే వాంతులు, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ ఎ.పుష్పలత, జనరల్ ఫిజిషియన్

చిన్న పిల్లలు జాగ్రత్త..



ఆరుబయట ఆటలాడుతూ, దాహం వేసినా నీళ్లు తాగకపోవడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల పదేళ్లలోపు పిల్లలు తేలికగా ఎండదెబ్బకు గురవుతుంటారు. పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. పిల్లలు నీరసంగా కనిపించినా, ఎక్కువ సమయం పడుకునే ఉంటున్నా, విరేచనాలు, వాంతులు అవుతున్నా డీహైడ్రేషన్‌కు గురయినట్టు భావించాలి. శరీరం వేడిగా ఉంటే చల్లని నీళ్లలో గుడ్డను తడిపి ఒళ్లు తుడవాలి. ఓఆర్ఎస్ తాగించాలి. పిల్లలు సరిపడా నీళ్లు తాగుతున్నారో, లేదో గమనించాలి. తాజా కూరగాయలు, పప్పు, పెరుగు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్.బి.వీరబాబు, పిల్లల వైద్య నిపుణులు

గిరిజన రిజర్వేషన్లపై సీఎం స్పందించాలి



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కొత్తగూడెంటౌన్: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఎస్టీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో గురువారం జరిగిన ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రిజర్వేషన్ల అమలుపై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వంద శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు నష్టపోయారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమైనా తీర్మానం చేసి రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వకపోతే లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. అలాగే, మంత్రి వర్గంలో లంబాడీ సామాజిక వర్గానికి స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఇరుప ప్రకాష్‌దొర, అర్రెం కృష్ణ, హరినాయక్, హుస్సేన్‌నాయక్, రాంబాబు నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భద్రాచలంఅర్బన్: గోదావరి ఒడ్డున గురువారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు గోదావరి ఒడ్డున మృతదేహం సుమారు 50 ఏళ్లు ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఉంటే 87126 82160, 87126 82106, 87126 82105 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ విజయలక్ష్మి సూచించారు.

అశ్వారావుపేటలో..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అశ్వారావుపేటరూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న సిమెంట్ బల్లాపై సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి.. మృతికి వడదెబ్బ కారణం కావొచ్చన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతుడు ఎరుపు రంగు గళ్ల చొక్కా, సిమెంట్ రంగు నిక్కరు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతుడిని గుర్తిస్తే సీఐ జితేందర్‌రెడ్డి సెల్ నంబరు 87126 82060, ఎస్‌ఐ శ్రీను సెల్ నంబరు 87126 82062కు సమాచారం అందించాలని కోరారు.

సహజీవనం శాపమైంది..

- వ్యక్తిని హత్య చేసిన మహిళ
- ఆపై ప్రమాదమంటూ పోలీసులకు ఫిర్యాదు
- మెడపై గాయాలతో హత్యగా గుర్తించిన వైద్యులు



శ్రీను మృతదేహం

ఇల్లెందురూరల్: భర్తకు దూరమై రోజువారీ కూలీ పనులు చేసుకుంటున్న మహిళతో ఏర్పడిన పరిచయం ఆయన్ను సహజీవనం వైపు నడిపించింది. ఇరువురి అంగీకారంతో తమకు పరిచయస్తులు లేని గ్రామంలో నివాసముంటుండగా.. నాలుగేళ్ల తర్వాత మొదలైన గొడవలు పెద్దవయ్యాయి. దీంతో సదరు మహిళ తనతో సహజీవనం చేస్తున్న వ్యక్తిని హత్య చేసింది. వివరాలిలా ఉన్నాయి. భర్తకు దూరమై జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నివాసం ఉంటున్న సునీత కూలీ పనులు చేసేది. అక్కడే ఒంటరిగా ఉంటూ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్న చిప్ప శ్రీను (48)తో పరిచయం ఏర్పడగా.. వీరిద్దరు ఇల్లెందు మండలం సుదిమళ్ల గ్రామపంచాయతీ వజ్జవారిగూడెంలో నాలుగేళ్లుగా సహజీవనం సాగిస్తున్నారు. ఇంతకాలం బాగానే ఉన్నా ఇటీవల తరచూ గొడవలు జరుగుతుండటంతో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న శ్రీనుపై సునీత దాడి చేసింది. మంచం కాలుకు శ్రీను తల తగిలి మృతి చెందాడని చెబుతూ గురువారం సునీత నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. సీఐ కరుణాకర్ చేరుకుని శ్రీను మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మృతదేహం మెడపై కమిలిన గుర్తులు ఉండడంతో అనుమానించిన వైద్యుడు బన్సీలాల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సునీతను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే హత్య చేసినట్లు అంగీకరించింది. మద్యం తాగొచ్చి తరచూ కొడుతుండటంతో హత్య చేసినట్లు ఒప్పుకుందని సీఐ తెలిపారు. కాగా, శ్రీను హత్యకు గురికావడం, ఆయనతో సహజీవనం చేస్తున్న సునీత పోలీసుల అదుపులో ఉండగా.. వీరిద్దరికి ఎవరు ఉన్నారో, లేదో తెలియని పరిస్థితుల్లో శ్రీను అంత్యక్రియలను గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వహించారు.

లారీడ్రైవర్ మృతి

పాల్వంచరూరల్: అనారోగ్యం కారణంగా రాజస్థాన్‌కు చెందిన లారీడ్రైవర్ గురువారం మృతి చెందాడు. రాజస్థాన్ రాష్ట్రం అజ్మీరా జిల్లా నషీరాబాద్ మండలం లంకార గ్రామానికి చెందిన లారీడ్రైవర్ మహవీర్ ప్రసాద్ వైష్ణవ్ (58) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తమిళనాడు రాష్ట్రానికి వెళ్తుండగా మార్గ మధ్యలోని భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం వద్ద అనారోగ్యం కారణంగా లారీలో మరణించాడని మృతుడి సోదరుడు అర్జున్ వైష్ణవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ట్రావెల్స్ బస్సు, ట్రాక్టర్ ఢీ..

ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

బూర్గంపాడు: సారపాక ప్రధాన కూడలిలో బుధవారం అర్ధరాత్రి ట్రావెల్ బస్సు, ట్రాక్టర్ ఢీ కొన్నాయి. ఒడిశా నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సు, బూర్గంపాడు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో భాస్కర్‌నగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చల్లా ఉప్పలయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానికులు వెంటనే భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో బస్సు ముందు భాగం, ట్రాక్టర్ దెబ్బతిన్నాయి. బస్సులో 30 మంది వరకు ప్రయాణికులుండగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఎస్‌ఐ నాగబిక్షం ఘటనా ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురంలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కేశవరావు గురువారం తెలిపారు. ఎస్‌ఐ గణేశ్ సిబ్బందితో కలిసి సుజ్ఞానపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి 30 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. సారాను స్వాధీనం చేసుకుని, వ్యక్తిని విచారించగా సుజ్ఞానపురం గ్రామానికి చెందిన చల్లా కల్యాణ్‌గా తేలింది.

8 మంది బైండోవర్..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సుజ్ఞానపురం గ్రామానికి చెందిన నాటుసారాకు సంబంధించి పాత నేరచరిత్ర కలిగిన 8 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ అశోక్ గురువారం తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

ములకలపల్లి: ఆన్‌లైన్ యాప్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపగా మోసపోయిన యువకుడు గురువారం పోలీసులను ఆశ్రయించాడు. మండల కేంద్రానికి చెందిన యువకుడు డీఐఓఆర్ యాప్‌లో రూ.60 వేలు పెట్టుబడి పెట్టాడు. కాగా రూ.60 వేలకు కొంత నగదు జమఅయ్యాయి. ఆశపడ్డ యువకుడు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆ వెంటనే యాప్ పనిచేయడం ఆగింది. మోసపోయానని గుర్తించిన యువకుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజమౌళి తెలిపారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి

దుమ్ముగూడెంలో వ్యక్తి..



వెంకటేశ్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని చింతగుప్ప గ్రామానికి చెందిన తొడం వెంకటేశ్ (28) వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై గురువారం మృతి చెందాడు. వెంకటేశ్ బుధవారం రోజంతా పని మీద ఎండలో తిరగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గురువారం ఉదయం గ్రామస్తులతో మాట్లాడుతూనే కుప్పకూలి పోయాడు. మృతుడికి భార్య ఉంది.

జగన్నాథపురంలో వృద్ధురాలు..



భూలక్ష్మి (ఫైల్)

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ పంచాయతీ పెద్దమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న తోట భూలక్ష్మి (67) వడదెబ్బ తగిలి గురువారం ఇంటివద్ద మృతి చెందింది. ఎండ తీవ్రంగా ఉండటంతో ఇంట్లోనే పడుకుని ఉందని, తెల్లవారుజామున చూసేసరికి మృతి చెంది ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'ఉపాధి' పనికి వెళ్లి వృద్ధుడు..

ములకలపల్లి: వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకుల కథనం మేరకు.. చౌటిగూడెం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గడ్డం ప్రసాద్ (57) ఉపాధి హామీ పనికి వెళ్లి ఇంటికి వచ్చాడు. నీరసంగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి పడుకున్నాడు. సాయంత్రం వరకూ నిద్రలేవక పోవడంతో కుటుంబ సభ్యులు చూడగా ప్రసాద్ మృతి చెంది ఉన్నాడు.

శతాధిక వృద్ధుడు మృతి

జూలూరుపాడు: మండలంలో అన్నారుపాడు గ్రామానికి చెందిన ముళ్లపాటి రామరాజు (107) బుధవారం రాత్రి మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎండతీవ్రత పెరగడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నారు. రామరాజు మృతదేహాన్ని పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

బజ్జీలు వేసి.. కూరగాయలు కొని..





బజ్జీలు వేస్తున్న మంత్రి పొంగులేటి సతీమణి మాధురి, కూరగాయలు కొనుగోలు చేస్తూ..

ములకలపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి గురువారం ములకలపల్లి మండలంలో పర్యటించారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. రోడ్డు పక్కనే ఉన్న మిర్చి బండి వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వారితో కలిసి బజ్జీలు వేశారు. మండల కేంద్రంలో కూరగాయల దుకాణం వద్దకు వెళ్లి కొనుగోలు చేశారు. హస్తం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

గ్యారంటీలు అమలు చేశాం..

పినపాక ఎమ్మెల్యే పాయం, డీసీసీ అధ్యక్షుడు వీరయ్య



మణుగూరులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, పక్కన ఎమ్మెల్యే పాయం తదితరులు

అశ్వాపురం/మణుగూరుటౌన్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేసిన కాంగ్రెస్‌ను లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలిపించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. గురువారం అశ్వాపురంలో కాంగ్రెస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తో పాటు మణుగూరులో నిర్వహించిన సమావేశాల్లో అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ఎన్నికల పరిశీలకులు డాక్టర్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని తెలిపారు. సీపీఐ, సీపీఎం, టీడీపీ, టీజేఎస్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించడం ద్వారా అభివృద్ధికి అత్యధిక నిధులు సాధించుకోవచ్చని వివరించారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ మాట్లాడుతూ.. గతంలో కేంద్ర మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషిచేశానని తెలిపారు. రోడ్లు, వంతెనలు, ఆస్పత్రులు, పాఠశాలల భవనానికి నిధులు కేటాయించానని చెప్పారు. మరోమారు తనను గెలిపించాలని కోరారు. అనంతరం సీపీఐ, సీపీఎం, టీడీపీ మిత్రపక్షాలను కలుపుకుంటూ బూత్ స్థాయిల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ తన విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశాల్లో అశ్వాపురం, మణుగూరు కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, పిరినాకి నవీన్, నాయకులు చందా హరికృష్ణ, దుర్గంపూడి కృష్ణారెడ్డి, కాటబోయిన నాగేశ్వరరావు, శివ, కూరపాటి సౌజన్య, భోగినేని వరలక్ష్మి, సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, తాటి బిక్షం, సీపీఐ, సీపీఎం, టీడీపీ, టీజేఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోమారు ప్రధాని మోదీనే..

మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్

భద్రాచలంటౌన్/బూర్గంపాడు: కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వాన బీజేపీ ప్రభుత్వం పేదల కోసం అమలుచేస్తున్న పథకాలతో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాంనాయక్ ధీమా వ్యక్తం చేశారు. భద్రాచలంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఏకలవ్య మోడల్ పాఠశాలలు, పర్ణశాలలో భక్తుల సౌకర్యం కోసం రూ.30 లక్షలతో వసతి గదుల నిర్మాణానికి కృషి చేశానని చెప్పారు. ఇదే సమయాన కేంద్ర మంత్రిగా పనిచేసిన బలరాంనాయక్ ఈ ప్రాంత అభివృద్ధికి ఏమి చేశారో చెప్పి ఓటు అడగాలని సూచించారు. బీజేపీ అమలుచేస్తున్న పథకాలను గుర్తించి తనను గెలిపించాలని.. తద్వారా ఈ ప్రాంత అభివృద్ధి వేగంగా జరుగుతుందని సీతారాంనాయక్ తెలిపారు. ఆతర్వాత భద్రాచలంలో పట్టణంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. కాగా, బూర్గంపాడు మండలంలో కూడా సీతారాంనాయక్ ప్రచారం చేశారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ మెయిన్ గేట్ వద్ద కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. బూర్గంపాడు, నాగినేనిప్రోలు గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, బీరక సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఎమ్మెల్యే తండ్రి కన్నుమూత



పుల్లయ్య (ఫైల్)

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య (95) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆరోగ్యం క్షీణించి టేకులపల్లి మండలం కోయగూడెంలోని స్వగృహంలో మృతి చెందారు. పుల్లయ్య భార్య సింగమ్మ కొన్నేళ్ల కిందటే మృతి చెందగా.. వీరికి కనకయ్య సహా ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, కోయగూడెంలో ఎమ్మెల్యే కనకయ్య తండ్రి మృతదేహం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు మువ్వా విజయ్‌బాబు, పిడమర్తి రవి, దిండిగల రాజేందర్, లక్కినేని సురేందర్‌రావు, విజయాబాయి, కోనేరు చిన్ని తదితరులు కూడా పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు.



పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

పుల్లయ్య మృతికి సంతాపం

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దానియేల్, పులి సైదులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, వివిధ పార్టీల నాయకులు జానీ, యదళ్లపల్లి అనసూర్య, కనగాల పేరయ్య, బంధం నాగయ్య, కె.సారయ్య, ఎస్‌ఏ నబీ, ముద్రగడ వంశీ, మడుగు సాంబమూర్తి, మేకల మల్లిబాబుయాదవ్, మూల మధూకర్‌రెడ్డి, మడత వెంకట్‌గౌడ్ సంతాపం ప్రకటించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ మా వద్ద మాధ్యమ, సాహిత్యరత్న హిందీ పరీక్షలకై, SSC, ఇంటర్, డిగ్రీ, పి.జి., MBA, MCA, LLB, B.Tech, ఫామ్-బి, ఫామ్-డి, BSC నర్సింగ్, ANM, GNM, 2023-25 సం॥ B.Ed. కొరకు. సంప్ర॥ 7396250709, కోదాడ. [M-1185053]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185061]

■ విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559 [B-043]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957, 9705444182

కొత్తగూడెం : 9010223783

ఫ్యాషన్

వేసవి వేడిమిని తట్టుకోవాలి,
కంఫర్ట్‌గా ఉండాలి
అదే టైమ్‌లో స్టైలిష్‌గానూ కనిపించాలి.
కాటన్ కుర్తీ పైకి బాందినీ,
చందేరీ, ఇకత్, సిల్క్ ఓవర్ కోట్లు
ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా ఉంటున్నాయి.
బోహోస్టైల్‌ని తలపిస్తూ, సమ్మర్ స్పెషల్‌గా ఉండే
ఈ స్టైల్ ఏ సందర్భానికైనా బాగా నప్పుతుంది.

కలర్‌ఫుల్‌గా.. కంఫర్టబుల్‌గా..



సంప్రదాయ వేడుకల్లో షిమ్మరీ లుక్ ఉండే లాంగ్ ఫ్రాక్స్, వాటి మీదకు సిల్క్ డిజైనర్ లాంగ్ ఓవర్ కోట్స్ ప్రత్యేకతను చూపుతాయి.



లాంగ్ ఫ్రాక్ లేదా లాంగ్ కుర్తీ ఈ స్టైల్‌కి ఎంచుకోవచ్చు. సాకర్యాన్ని బట్టి స్లీవ్స్ లేదా స్లీవ్‌లెస్ టాప్స్‌ని సెలక్ట్ చేసుకోవాలి. కాటన్ కుర్తీ ఏ ఫ్యాబ్రిక్ అయినా ఫ్లోరల్స్‌లో లేదా భిన్నమైన ప్రింట్లు ఉన్న ఓవర్ కోట్స్ బాగా నప్పుతాయి. ఈ స్టైల్ డ్రెస్సింగ్ బోహో లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా ఫ్యాషన్ జ్యువెలరీ దీనికి సరైన ఎంపిక అవుతుంది.

కాటన్ కుర్తీ–పైజామా మీదకు ఫ్లోరల్ ప్రింట్ ఉన్న కాటన్ ఓవర్‌కోట్‌ను ధరించవచ్చు. దుపట్టా అవసరం లేని ఈ స్టైల్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ సెట్ అవుతుంది.



ప్లెయిన్ డ్రెస్ ధరించినప్పుడు పూర్తి కాంట్రాస్ట్ ఓవర్ కోట్ వేసుకుంటే ఎక్కడ ఉన్నా స్పెషల్‌గా కనిపిస్తారు.



లాంగ్ ఫ్రాక్‌కి అటాచ్ చేసినట్టుగా ఉండే ఫ్రాక్ స్టైల్ ఓవర్ కోట్ పార్టీలో స్టైలిష్ లుక్‌తో వెలిగిపోతుంది.



కాటన్ లాంగ్ కుర్తీకి ఇక్కత్ లాంగ్ ఓవర్ కోట్ ధరిస్తే ఉక్కబోతను, స్టైల్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చు.



సింపుల్ అండ్ గ్రేస్‌గా కనిపించే లుక్ టాప్ అండ్ బాటమ్‌కి ఫ్లోరల్ ఓవర్ లాంగ్ కోట్ సూపర్ స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది.



సిల్క్ టాప్స్ అయినా ఈవెనింగ్ టైమ్‌కి ఓకే అనుకున్నవారు అదే కాంబినేషన్‌లో వచ్చే సిల్క్ ఓవర్ కోట్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.



ఓవర్‌కోట్‌లా అనిపించే లాంగ్ ఫ్రాక్ డ్రెస్‌ను కూడా ఈ స్టైల్‌కి ఎంపిక చేసుకోవచ్చు. సమ్మర్‌లో ఈవెనింగ్ పార్టీకి స్పెషల్ అట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు.

ఎక్స్‌పర్ట్

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది.
ఎన్నికల సమయంలోనే కాదు
సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు
ప్రముఖులకు పెద్ద సవాలు.
ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి.
వీటి గుట్టుమట్లు ఏమిటో
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నీడలో
ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది
ఆ రంగంలో నిపుణురాలు మధుమితా ముర్గియా.

డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు



మధుమితా ముర్గియా

‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపాలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పార్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి ‘ఇమేజ్ క్రియేటింగ్’. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పోర్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపొచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది’ అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్.

బ్రిటిష్ ఇండియన్

ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యూనాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం ‘కోడ్ డిపెండెంట్’కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది.

ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. ‘ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాస్యూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యా రంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే’ అంటుందామె.

చెడు ఎంతో ఉంది:

‘ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే’ అంటోంది మధుమిత.

వంటిల్లు

చల్ల కూరలు

మే నెల వచ్చేసింది... ఎండలు మండుతున్నాయి.
భోజనం చేయాలంటే చెమటలు పడుతున్నాయి.
కూరలను చూస్తేనే ఆకలి పోయి దాహం వేస్తోంది.
నేరుగా మజ్జిగలోకి వెళ్లాలనిపించేంత దాహం అది.
అందుకే పెరుగుతోనే కూరలు చేసుకుందాం.
ఇవన్నీ నాలుకకు హితవుగా ఉంటాయి.
తిన్న తర్వాత పొట్టను చల్లగా ఉంచుతాయి.

దహీ బైంగాన్



కావలసినవి: వంకాయ – 1 (మీడియం సైజు); నూనె – టేబుల్ స్పూన్ (వంటకు ఉపయోగించే నూనె ఏదైనా) ; ఆవనూనె – టేబుల్ స్పూన్ (పోపు కోసం) ; యాలకులు – 2 ; లవంగాలు – 2 ; పెరుగు – పావు లీటరు (చిలకాలి).

గ్రేవీ కోసం: మెంతిపిండి – టేబుల్ స్పూన్ ;అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; కశ్మీర్ మిర్చిపొడర్ – టేబుల్ స్పూన్ ; నీరు – కప్పు (పై వన్నీ కలపడానికి) ; ఇంగువ– చిటికెడు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు – టీ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో మెంతిపిండి, మిర్చిపొడర్, అల్లం పేస్టు వేసి కలపాలి ● వంకాయను మందపాటి చక్రాల్లా తరిగి ఉప్పు రాయాలి ● నూనె వేడి చేసి వంకాయ ముక్కలను వేయించి పక్కన పెట్టాలి(ఎయిర్ ఫ్రయర్ ఉంటే నూనె లేకుండా ఫ్రై చేసుకోవచ్చు) ● అదే బాణలిలో మిగిలిన నూనెలో ఆవ నూనె వేసి వేడెక్కిన తర్వాత లవంగాలు, యాలకులు, ఇంగువ వేయాలి. ఇందులో మెంతిపిండి, అల్లం, మిరప్పొడి కలిపిన మిశ్రమం, పసుపు వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి ● ఆ మిశ్రమం వేడెక్కిన తర్వాత పెరుగు వేసి గరిటెతో కలుపుతూ ఐదారు నిమిషాల పాటు మరిగించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మరో కప్పు నీటిని పోసి కలిపితే చిక్కటి గ్రేవీ తయారవుతుంది. ఇప్పుడు ఉప్పు కలిపి గ్రేవీ చిక్కదనాన్ని సరిచూసుకుని అవసరమైతే మరికొన్ని నీటిని పోసి మరగనివ్వాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వంకాయ ముక్కలను వేసి కలిపి వడ్డించాలి. ఇది అన్నంలోకి రోటీకి కూడా మంచి కాంబినేషన్.

పులిస్సెరి



కావలసినవి: పెరుగు – పావు లీటరు ; పసుపు – పావు టీ స్పూన్ ; నీరు – పావు లీటరు.

కొబ్బరి పేస్టు కోసం: పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు ; పచ్చిమిర్చి– 3 ; జీలకర్ర– టీ స్పూన్; నీరు – కప్పు లేదా కొబ్బరి పేస్టు చేయడానికి తగినంత.

పోపు కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్‌లు (వంటకు ఉపయోగించే కొబ్బరి నూనె లేదా ఇతర వంట నూనె) ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; మెంతులు– పావు టీ స్పూన్ ; ఎండుమిర్చి– 2 ; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు ; అల్లం – అర అంగుళం ముక్క (సన్నగా తరగాలి) ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర మిక్సీలో గ్రైండ్ చేయాలి. తగినంత నీటిని వేస్తూ మెత్తగా చేసుకోవాలి ● ఒక పాత్రలో పెరుగు, పసుపు, నీరు కలిపి చిలికి అందులో ఉప్పు, కొబ్బరి పేస్టు వేసి కలపాలి ● ఈ పాత్రను స్టవ్ మీద పెట్టి మీడియం మంటమీద మధ్యలో గరిటెతో కలుపుతూ వేడిచేయాలి. దీనిని ఎక్కువసేపు ఉడికించాల్సిన అవసరం లేదు. మరగడం మొదలైన వెంటనే దించేయాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మెంతులు, ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తర్వాత పోపును ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన పెరుగు– కొబ్బరి పేస్టు మిశ్రమంలో కలిపి, కొత్తిమీర చల్లి మూత పెట్టాలి. ఈ కేరళ వంట అన్నంలోకి రుచిగా ఉంటుంది.

గుజరాతీ కడీ

కావలసినవి: శనగపిండి– 4 టేబుల్ స్పూన్‌లు; అల్లం పచ్చిమిర్చి పేస్ట్– అర టేబుల్ స్పూన్ (అల్లం అంగుళం ముక్క, రెండు పచ్చిమిర్చి కలిపి గ్రైండ్ చేయాలి); తాజా పెరుగు – కప్పు ; బెల్లం లేదా చక్కెర – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నీరు – రెండున్నర కప్పులు.

పోపు కోసం: నూనె – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర– అర టీ స్పూన్ ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; కరివేపాకు – ఒక రెమ్మ ; ఎండు మిర్చి – 2; మెంతులు – పావు టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, అల్లం–పచ్చిమిర్చి పేస్ట్, పెరుగు, బెల్లం, ఉప్పు వేసి బాగా చిలకాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి పేలిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, కరివేపాకు, ఎండుమిర్చి (విరిచి వేయాలి), మెంతులు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత స్టవ్ ఆపేయాలి. ఈ పోపును ముందుగా చిలికి పెట్టుకున్న పెరుగు – శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● ఇప్పుడు ఆ పాత్రను మీడియం మంట మీద ఉంచి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి కలుపుతూ మాడకుండా చూసుకోవాలి. శనగపిండి పచ్చి వాసన పోయిన తర్వాత మిశ్రమం మంచి రుచికరమైన వాసన వస్తుంటుంది. అప్పుడు కొత్తిమీర చల్లి దించేయాలి ● గుజరాతీ కడీని సూప్‌లాగ భోజనానికి ముందు తాగవచ్చు. అన్నంలో కలుపుకోవచ్చు, రోటీలోకి కూడా తినవచ్చు. ఇది వేసవి, శీతాకాలాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం.



కుకురార్



కావలసినవి: చికెన్ – అర కేజీ ; చిక్కటి పెరుగు – 5 టేబుల్ స్పూన్‌లు ; బంగాళ దుంప – 2 (ముక్కలుగా తరగాలి) ; అల్లం వెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉల్లిపాయలు – 3 (తరగాలి) ; ఆవ నూనె లేదా సాధారణ వంటనూనె – 5 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – చిటికెడు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి ; ఎండు మిర్చి– 5 ; పచ్చిమిర్చి– 3 (నిలువుగా చీరాలి) ; పసుపు – టీ స్పూన్ ; మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; గరం మసాలా పొడి – టీ స్పూన్ ; చికెన్ మసాలా పొడి– టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేయాలి. అందులో పసుపు, చికెన్ మసాలా పొడి, మిరప్పొడి వేసి మసాలా పొడులు చికెన్ ముక్కలకు బాగా పట్టేటట్లు కలిపి 20 నిమిషాల పాటు పక్కన ఉంచాలి ● ఈ లోపు ఒక బాణలిలో నూనె వేడి చేసి అందులో ఇంగువ, చక్కెర, ఎండు మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇవి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి సమంగా కలిసేటట్లు ఒకసారి తిప్పి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన పెట్టాలి ● ఉల్లిపాయలు వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో బంగాళా దుంప ముక్కలు వేయించి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి. అదే బాణలిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేయించి తీసి పెట్టుకోవాలి ● ఇప్పుడు మిగిలిన నూనెలో మారినేట్ చేసిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ముక్కలు ఎర్రగా వచ్చేవరకు వేయించి అప్పుడు ఉప్పు వేసి ముక్కలకు పట్టేటట్లు కలపాలి. చికెన్ ముక్కల నుంచి నూనె వేరవుతున్న సమయంలో బంగాళాదుంప ముక్కలను వేయాలి. ఈ రెండింటినీ కలిపి పది నిమిషాల పాటు వేయించిన తర్వాత అందులో రెండు కప్పుల నీరు పోసి కలిపి మంట పెంచి ఉడకనివ్వాలి ● చికెన్ ఉడికేటప్పుడు అందులో ముందుగా వేయించి పెట్టుకున్న అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చితోపాటు గరం మసాలా పొడి, చిలికిన పెరుగు మిశ్రమాన్ని వేయాలి. ఇవన్నీ కలిసి ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర వేసి కలిపి దించేయాలి. ఈ కుకురార్ అస్సాం వాళ్ల వంట. అన్నం, రోటీల్లోకి రుచిగా ఉంటుంది.